కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్‌–2 పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం 11కేవీ వాసవిశివనగర్ ఫీడర్ పరిధిలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని మారుతీ ఎన్‌క్లేవ్, వాసవి ఎన్‌క్లేవ్, వాసవిశివనగర్, అమూల్య హోమ్స్, న్యూ వాసవిశివనగర్, గణేష్‌నగర్, సోనీయాగాంధీనగర్, లక్ష్మీనర్సింహకాలనీ, శుభోదయనగర్, ఎంఆర్‌ఆర్ కాలనీ, మీనాక్షినగర్, శివసాయినగర్, నాగార్జుననగర్ రోడ్డు నంబర్లు–1, 2లలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కరెంటు ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

బోడుప్పల్ సబ్ స్టేషన్ పరిధిలో..

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు 33/11 కేవీ బోడుప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో సూర్యహిల్స్, రాజశేఖర్ కాలనీ, వెస్ట్ బాలాజీ హిల్స్, హేమానగర్, వాసవినగర్, సప్తగిరి హిల్స్, తిరుమల మెడోస్, ఈస్ట్ బాలాజీ హిల్స్, పద్మావతి కాలనీ, శ్రీనివాస్ కాలనీ, ఆంజనేయనగర్, ద్వారకానగర్, కేశవనగర్, బృందావన్ కాలనీ, సాయిమారుతీనగర్, హుడా లక్ష్మీనగర్, ఆకృతి టౌన్‌షిప్, ఈస్ట్ బృందావన్ కాలనీ, సత్తిరెడ్డి కాలనీ, సాయిరాంనగర్ కాలనీ, బయ్యన్నగూడ, బొమ్మక్ బ్రదర్స్ కాలనీ, యాదవ బస్తీ, ఎస్సీ బస్తీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ పతంగుల పంపిణీ



హెచ్‌బీకాలనీలో పతంగులు పంపిణీ చేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

కుషాయిగూడ: సంక్రాంతి పండగను పురస్కరించుకొని గురువారం హెచ్‌బీకాలనీ, తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో పతంగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పతంగులను పంపిణీ చేశారు. ఎన్ఎస్‌యుఐ ఉప్పల్ అధ్యక్షుడు కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జలగం వెంకటేష్, సీతారాంరెడ్డి, పోలేపాక అంజయ్య, వెంకట్‌రెడ్డి, రాజేష్, విఠల్‌నాయక్, మల్లికార్జున్, నవీన్, ఉదయ్, జెమిని, ఆకాశ్, మహేష్, సమ్మయ్య, రాజయ్య, మల్లేష్, యాకుబ్, అఖిల్ పాల్గొన్నారు.

మల్లాపూర్ బీరప్ప మహంకాళి దేవస్థానం కమిటీ ఎన్నిక



మల్లాపూర్: మల్లాపూర్ బీరప్ప మహంకాళి దేవస్థానం నూతన కమిటీని గురువారం ఫౌండర్ బెల్లం గట్టయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చిగుళ్ల శ్రీనివాస్ కురుమ, వైస్ చైర్మన్‌గా సీతాల వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా చౌదరిపల్లి పర్వతాలు, సంయుక్త కార్యదర్శులుగా వాస్పరి శ్రీనివాస్ కురుమ, భూమండ్ల శ్రీశైలం కురుమ, కార్యనిర్వాహక కార్యదర్శిగా గుంటి బాలయ్య కురుమ ప్రచార కార్యదర్శిగా జెట్ట శ్రీశైలం కురుమ, మేకల నరసింహ కురుమ, సంయుక్త కార్యదర్శిగా చిరునాగుల వీరేశ్ కురుమ, కోశాధికారి వన్నెకాల వీరేశ్ కురుమ, సలహాదారులుగా చిగుళ్ల మల్లేష్ కురుమ, గౌడ మల్లేష్ కురుమ, తాటిపెళ్లి ఐలయ్య, కమిటీ సభ్యులను తదితరులను ఎన్నుకున్నారు.

ఖాజా గరిబాన్ నవాజ్ ఉర్సు ఉత్సవాలకు చాదర్



కాప్రా: ప్రతి సంవత్సరం రాజస్థాన్ అజ్మీర్ షరీఫ్‌లోని ఖాజా గరిబాన్ నవాజ్ ఉర్సు ఉత్సవాలకు ఘీలాఫ్(చాదర్)ను అందించనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు మాజీ హోంమంత్రి మహమూద్ అలీ ఆధ్వర్యంలో గురువారం చాదర్‌ను తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, బీఆర్ఎస్‌కు పూర్వవైభవం రావాలని ప్రార్థిస్తూ చాదర్‌ను అందించనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎం.కె.బద్రోద్దీన్, మలక్‌పేట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆజం అలీ, బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు బసిత్ పాల్గొన్నారు.

జాతీయ అవార్డు అందుకున్న ఎస్‌ఎఫ్‌ఏ మంజుల



కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) జాతీయ అవార్డు అందుకుంది. గార్బేజ్ ఫ్రీ సిటీలో భాగంగా ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో స్వచ్ఛ సర్వేక్షణ–2023లో ఆల్ ఇండియా క్లీన్‌సిటీ 9వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా ఢిల్లీలో కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్‌పూరి చేతులమీదుగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆధ్వర్యంలో టీం హైదరాబాద్ ఈ అవార్డును అందుకుంది. ఈ బృందంలో కాప్రా సర్కిల్‌కు చెందిన ఎస్‌ఎఫ్‌ఏ మంజులతో పాటు నగరంలోని వివిధ సర్కిళ్లకు చెందిన ఇద్దరు స్వచ్ఛ వర్కర్లు, ఇద్దరు స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో పాటు మరో సిబ్బంది ఉన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌తో పాటు శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సోమభరత్, శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ మంజుల పాల్గొన్నారు.

అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు



ఉప్పల్: ఉప్పల్ శ్రీశివశంకర మహమ్మాయి దేవాలయంలో మార్గశిర మాస అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ సభ్యులు ఉప్పోజి బలవంతచారి, భిక్షపతి, రాజగోపాలచారి, శామిర్‌పేట ధర్మారెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ దేవతలపై స్థానికులకు అపార నమ్మకం ఉంటుందని గుర్తు చేశారు. ఉప్పల్ స్థానికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

డ్రైనేజీలో కెమికల్స్.. కాలనీ అంతా హడల్..

- పారిశ్రామికవాడ వ్యర్థాలు డ్రైనేజీలోకి ఎలా వచ్చాయి
- గోడు వెళ్లబోసుకున్న వెంకట్‌రెడ్డినగర్ కాలనీవాసులు
- కెమికల్స్ వదిలిన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి
- సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- బాధ్యులను వెంటనే గుర్తించాలని ఎమ్మెల్యే ఆదేశం
- వెంకట్‌రెడ్డినగర్‌ను సందర్శించిన అధికారుల బృందం



వెంకట్‌రెడ్డినగర్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జెడ్సీ పంకజ తదితరులు



పేలుళ్ల దాటికి ఛిద్రమైన మ్యాన్‌హోల్స్

కుషాయిగూడ: ఇటీవల చర్లపల్లి డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో చోటుచేసుకున్న పేలుళ్ల నేపథ్యంలో గురువారం స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి వివిధ శాఖల అధికారుల బృందం వెంకట్‌రెడ్డినగర్‌ను సందర్శించింది. పది రోజులు గడుస్తున్నా అధికారుల్లో చలనం లేకపోవడంతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి పేలుళ్ల ఘటనపై వివరించారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ పేలుళ్ల ఘటనపై వివరాలు అందజేయాలని జోనల్ అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ పంకజ, కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, పోలీసు, పొల్యూషన్, ఐలా విభాగాలకు చెందిన అధికారులు వెంకట్‌రెడ్డినగర్‌ను సందర్శించారు. పేలుళ్ల తీరుపై వివరాలు సేకరించారు. డ్రైనేజీలో కలుస్తున్న కెమికల్స్ శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపాలని జెడ్సీ అధికారులను ఆదేశించారు. కాలనీకి రెండు వైపులా ఉన్న ఫేజ్–5, ఫేజ్–2లోని కెమికల్ పరిశ్రమలను క్షుణ్ణంగా పరిశీలించారన్నారు.

గోడు వెళ్లబోసుకున్న వెంకట్‌రెడ్డినగర్ వాసులు..

ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జీవిస్తున్నామంటూ వెంకట్‌రెడ్డినగర్ కాలనీవాసులు అధికారులతో మొరపెట్టుకున్నారు. ఘటన జరిగి పది రోజులు కావస్తున్నా ఇప్పటికీ కాలనీలు, ఇళ్లలో పేలుళ్లకు కారణమైన కెమికల్స్ ఘాటైన వాసనలు వస్తుండటం భయాందోళనలకు గురిచేస్తోందన్నారు. ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నామని, జరగరానిది జరిగితే మా పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పారిశ్రామికవాడకు సంబంధించి డ్రైనేజీ వ్యవస్థ సపరేట్‌గా ఉన్నప్పటికీ జీహెచ్‌ఎంసీ డ్రైనేజీలో పరిశ్రమల వ్యర్థాలు ఎలా కలుస్తున్నాయో విచారణ చేపట్టాలన్నారు. జీహెచ్‌ఎంసీ డ్రైనేజీకి పరిశ్రమల అవుట్‌లేట్ కలిపి అధికారులు మా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డ్రైనేజీలో కెమికల్స్ వదిలిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని వేడుకున్నారు.

బాధ్యులను గుర్తించాలి

చర్లపల్లి వెంకట్‌రెడ్డినగర్‌లో పేలుళ్లకు కారణమైన బాధ్యులను గుర్తించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. పది రోజులు గడుస్తున్నా బాధ్యులను గుర్తించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడం తగదన్నారు. విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించడంతో పాటు తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసి వెంకట్‌రెడ్డినగర్ కాలనీవాసులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు.

శుభాకాంక్షలు



అల్వాల్: అల్వాల్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టి రాహుల్‌దేవ్‌ను మచ్చబొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, ఎస్‌కే అప్సర్, శ్రీశైలం యాదవ్, పుట్నాల కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు



మౌలాలి: సంక్రాంతి పండగ సందర్భంగా నేరేడ్‌మెట్‌లోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో గురువారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు అందమైన ముగ్గులు వేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేబెక మన్మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు



కాప్రా తహసీల్దార్ మతిన్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదిత్యనగర్ వాసులు

కాప్రా: ఆదిత్యనగర్‌లో అనధికారికంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారని స్థానిక కాలనీవాసులు గురువారం కాప్రా తహసీల్దార్ మతిన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం కాప్రా సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిత్యనగర్ పరిసర ప్రాంతంలో ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటాయని, దానికి తోడు వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా నీటిని తోడేస్తూ అక్రమంగా ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారని తెలిపారు. అక్రమంగా ఇష్టానుసారంగా నీటిని విక్రయించడంతో స్థానికులకు తాగునీటి కొరత ఏర్పడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి అనుమతులు లేకున్నా ప్లాంట్ ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తున్న సదరు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదిత్యనగర్ కాలనీ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, సంజీవరెడ్డి, సెక్రటరీ రామాచారి, సభ్యులు రఘు, రాజు, సురేష్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టం.. డ్రైవర్లకు ఉరితాడు



ఉప్పల్‌లో లారీ డ్రైవర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఉప్పల్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉప్పల్ లారీ డ్రైవర్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట్ర నాయకులు వంగూరు రాములు మాట్లాడుతూ ఈ చట్టం డ్రైవర్లకు ఉరితాడు అన్నారు. హిట్ అండ్ రన్ కేసులో ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు, రూ.7 లక్షల జరిమానాను విధిస్తామని తీసుకువచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ నాయకులు హీరాలాల్, మోహన్‌రెడ్డి, సీఐటీయూ ఉప్పల్ కార్యదర్శి జె.వెంకన్న, లారీ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డె ఓబన్న జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: వడ్డె ఓబన్న జయంతి వేడుకలను చిలుకానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరై నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఈస్ట్ ఇండియా కంపెనీ సైన్యానికి వణుకు పుట్టించిన మహాయోధుడని కొనియాడారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చేసిన సాయుధ పోరులో పాలుపంచుకున్న ఓబన్న చేసిన త్యాగాలు మరువలేనివన్నారు. అలాంటి మహనీయుడిని మరిచిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో చెన్‌రెడ్డి రఘుపతి రెడ్డి, గుంజ సంతోష్, వడ్డే తమ్మిశెట్టి శివకుమార్, దేవిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ క్రీడలు

రామంతాపూర్: ప్రభుత్వ జవహర్‌లాల్ నెహ్రూనగర్ పాలిటెక్నిక్ మైదానంలో రెండు రోజులుగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. విజయం సాధించిన జట్లకు రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్, కృష్ణారావు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి విజయం సాధించిన జట్లను జాతీయస్థాయిలో జరిగే పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సలహాదారు సురేష్‌నాయక్, రేణుకా తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పంపిణీ చేస్తూ..

డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలి



ఉప్పల్: ఉప్పల్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు పథకాల గ్యారంటీల డేటా ఎంట్రీ కేంద్రాన్ని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తుల ఎంట్రీ విధానాన్ని ఆపరేటర్లను, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంట్రీలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల్ డీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి స్ఫూర్తి నింపిన ఎమ్మెల్యే



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం అరుంధతి ఆస్పత్రిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం పట్ల చాలా మందికి అపోహలు ఉన్నాయని, ఆరోగ్యంగా ఉండి 18 సంవత్సరాలు పైబడి 65 సంవత్సరాల వయసు ఉన్నవారు వారు రక్తదానం చేయవచ్చని అన్నారు. తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నానని, నేటి యువత రక్తదానం కోసం ముందుకు రావాలన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వినతి

బోడుప్పల్: లక్ష్మీనగర్(హుడా) కాలనీలో బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆ కాలనీ అధ్యక్షులు అమరలింగారెడ్డి గురువారం కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లన్నీ అధ్వానంగా ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టి ప్రజలకు అసౌకర్యం లేకుండా చూడాలని కోరారు. ముఖ్యంగా వాసవి కిరణాషాపు నుంచి కిరణ్ స్కూల్ వరకు ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించడం కష్టంగా ఉందన్నారు. ప్రజల బాధలను అర్థం చేసుకుని మరమ్మతులు చేపట్టాలని ఆయన వినతి పత్రంలో కోరారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి



అల్వాల్: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అల్వాల్ ఎస్ఐ అంబికాగౌడ్ అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా అల్వాల్ పంచశీల కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భరత్‌రెడ్డి, రవి, బసవరాజు నరేష్, మిట్టల్ గిరి, సందీప్, చంద్రం, రాజేందర్, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీ, మాధవి, మానస, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉప్పల్ ప్రజల ఆదరణ మరువను

కుషాయిగూడ: తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ఉప్పల్ ప్రజల ఆదరణను మరవలేనని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, మంగాపురం షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు బీఎల్‌ఆర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరణ, దైవానుగ్రహంతోనే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానన్నారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, వంసతరావు, మాధవరెడ్డి, పద్మావతి, బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వరరావు, గుమ్మడి జంపాల్‌రెడ్డి, పూస రమేష్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇందిరానగర్ కేలండర్ ఆవిష్కరణ



ఇందిరానగర్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్లు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, వంజరి ప్రవీణ్, కాలనీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, కాశీ, రంగారెడ్డి, ఆర్‌కే రెడ్డి, కృష్ణమూర్తి, లక్ష్మీ, శోభ, విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ



మల్కాజిగిరి: శ్రీరామతీర్థ క్షేత్ర సమితి మల్కాజిగిరి ఆధ్వర్యంలో అయోధ్యలో పూజలు జరిపిన అక్షింతల పంపిణీ కార్యక్రమం మల్కాజిగిరిలో జరిగింది. ఓల్డ్ మల్కాజిగిరి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కార్యక్రమ వివరాలను తెలియజేశారు. జిల్లా సంయోజక్ బత్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికే 1.2 లక్షల గృహస్తులకు అక్షింతల పంపిణీ పూర్తయ్యిందన్నారు. ఈ నెల 22 వరకు పంపిణీ కొనసాగుతుందని, ఇంటికి అక్షింతలు రానివారు 22వ తేదీ అయోధ్యలో బాలరాముని ప్రతిష్ఠ సందర్భంగా పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ కూడా అందజేస్తామన్నారు. మల్కాజిగిరి సంఘచాలకులు జూలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మల్కాజిగిరిలో 30 వేల ఇళ్లకు పంపిణీ చేశామని, ప్రతిష్ఠ రోజు వివిధ కూడళ్లలో కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్, రామేశ్వర్ సుత్రావే, ప్రభుగుప్తా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి సెల్‌ఫోన్ అపహరణ

కుషాయిగూడ: దృష్టి మరల్చి సెల్‌ఫోన్ అపహరించిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. కాప్రా పరిమళనగర్‌కు చెందిన ట్రావెల్స్ నిర్వాహకుడు నీరుగొండ సతీష్‌బాబు బుధవారం రాత్రి భవానీనగర్ కమాన్ ఎదురుగా ఉన్న కర్రీ పాయింట్‌కు వచ్చాడు. కర్రీ తీసుకొని తిరిగి వెళ్తున్న క్రమంలో ఆయన ఎదురుగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు తన బైక్ పడిపోతున్నట్లు నటించాడు. దీంతో పడిపోతున్న బైక్‌ను పైకి ఎత్తేందుకు తనవంతు సాయం అందిస్తుండగా పక్కనే ఉన్న మరో యువకుడు వచ్చి ఆయనతో కలిసి బైక్‌ను ఎత్తుతున్నట్లు నమ్మించి షర్ట్ జేబులో ఉన్న ఐఫోన్–15ప్రో సెల్‌ఫోన్‌ను అపహరించి అక్కడి నుంచి జారుకున్నాడు. బైక్‌పై వచ్చిన యువకుడు కూడా అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇంటికి వెళ్లి చూడగా తన సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో గురువారం కుషాయిగూడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సమీప సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను గుర్తించే పనిలో పడ్డారు. ఈ తరహా దొంగతనాలు తరచూ చోటు చేసుకుంటున్నాయని అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

యూజీడీ సమస్యలను పరిష్కరించండి

మాజీ కార్పొరేటర్ జ్యోత్స్న



జల మండలి అధికారిని కలిసిన మాజీ కార్పొరేటర్

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని భూగర్భ డ్రైనేజీలు బస్తీలు, కాలనీల్లో ప్రతిరోజూ పొంగుతున్నాయని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు జలమండలి జీఎం సంతోష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ డీమార్ట్ బ్యాక్‌సైడ్ లేన్, మెట్లగల్లి దగ్గర డ్రైనేజీ పైప్ లైన్ మార్చేసి కొత్త పైప్‌లు ఏర్పాటు చేస్తేనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని, అదేవిధంగా శ్రీనగర్ కాలనీ ఇందిరానగర్, శేఖర్‌బస్తీ వరకు భూగర్భ డ్రైనేజీలో పేరుకుపోయిన బురద, మట్టిని వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని ఆమె వినతిపత్రంలో పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని అధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

అమావాస్య అన్నదానం



కుషాయిగూడలో అన్నదానం నిర్వహిస్తున్న మారుతి మిత్రమండలి ప్రతినిధులు

కుషాయిగూడ: అమావాస్య సందర్భంగా కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద కుషాయిగూడకు చెందిన మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక సేవాభావనతో ప్రతి అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హనుమంతు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మారుతి మిత్రమండలి ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాలచారి, మచ్చ బాబుగౌడ్, కాసుల సురేష్‌గౌడ్, వెంకటేశ్‌చారి, కాసుల శ్రీకాంత్‌గౌడ్, సతీష్‌తో పాటు ఎస్ఏ రహీం, సీనియర్ జర్నలిస్టు జ్యోతిర్మయాచారి తదితరులు పాల్గొన్నారు.